# నత్తివాడి కథ

## మెడికో శ్యామ్

ఒక్కణ్ణీకూచుని ఆలోచించడం నా కలవాటయి పోయింది. 'ఏంటి ఆలోచిస్తున్నావూ?' అంటే 'ఇదీ' అని చెప్పలేను. ఏదో యోచన.

ఒంటరితనం జీవితంలో వెళిపోయిన వెన్నెల పీడలేగాని పడుతున్న వెన్నెల సోనలులేవు.

మరిచిపోవల్సిన జ్ఞాపకాలు, దాటిపోయిన మలుపులు, ఎక్కడో ఎప్పుడో ఎగిసిన గాలి పటం ..సినిమాల్లో స్టిల్ చిత్రాల్లా నా జ్ఞాపకాలు.

చాలా జ్ఞాపకాలు నావి తీపివి కావు.

పిల్లిని నాలుగువైపులా కార్నర్ చేస్తే... కళ్ళు పీకేంత వైల్డ్‌గా అవుతుందంటారు. కాని బిక్కచచ్చిపోవొచ్చు కూడ పిల్లిపిల్ల అయితే.

బిక్కచచ్చిన పిల్లిపిల్ల మ్యావ్ మ్యావ్ మనదా? ఆ మ్యావ్ మ్యావ్‌లో ఆ ప్రింగ్‌లో ఏదన్నా తేడా వుంటుందా వుండదా?

ప్రింగ్ కేట్‌ని పట్టుకుంటే వుండే థ్రిల్?

పాలుతాగే పిల్లుల్ని వర్ణించిన కవులు బిక్కచచ్చిన పిల్లిపిల్లని వర్ణించరేం?

ఓ చీమని తీసుకోండి దాని చుట్టూ నీటితో ఓ గడి కట్టండి. అది చూసిన చోటినే చూసి చూసి, తిరిగిన దారినే తిరిగి తిరిగి అలసి పోతుంది. దాని బుర్రలో, బ్రెయిన్‌లో ఆవేదన ఆవేశం ఆలోచించితే—

చీమకి బుర్రేమిటి? బ్రెయినేమిటి? అన కండి. ఇన్‌సెక్ట్‌కి బ్రెయిన్ చాలా పెద్దదట శరీరంతో పోల్చి చూస్తే—

ఆవేదనతో ఆవేశంతో అలసి సొలసిన చీమ బిక్క చచ్చిపోదా?

చీమకి భాష వస్తే, పిల్లికి మాటలు వస్తే అవికూడా నాలాగే నత్తిగా తయారయేవేమో!?

నాకు చిన్నపుడు మాటలు వేగం రాలేదుట. 'అమ్మ, అత్త, తాత' అని అందర్లాగానే మామూలుగానే మామూలు వయసుకే అన్నానుట గానీ ఆ తరువాత చాలా మాటలు పలక లేక పోయేవాణ్నట. అదేమో నాకు తెలీదు. గాని చిన్నపుడు నాతో మాట్లాడడానికెవరూ వుండేవారు గాదు. ఇంట్లోంచి కదిలేవాణ్ని గాదు. ఇప్పుడాలోచిస్తే....హోదా అనో మరేదో అనో మా ఇంటి పక్కవాళ్ళ నానిగాడితో ఆడ నిచ్చేవారు గాదు. వాడొక్కడే ఆ ప్రాంతంలో నా వయసువాడు.

ఎంతసేపని బొమ్మలతో ఆడుతాం?

మా అమ్మ బొమ్మలా వుండేది అందంగా. అలా అనుకునేవాణ్ని ఆ రోజుల్లో. ఇప్పుడాలోచిస్తే నిజంగా బొమ్మ అన్పిస్తోంది. అందాల బొమ్మ. అపరంజి బొమ్మేకాదు. మరబొమ్మ.

మా నాన్నలాటి వాళ్ళ దృష్టిలో ఆడవాళ్ళు మరబొమ్మలే కాదు. కీలుబొమ్మలుకూడ.

నాకు ఏమీ తెలీని ఆ వయసులో, ఓ నిశ్శబ్ద వాతావరణంలో ఏదో తెలీని ఇమ్మినెంట్ డెత్ ముందున్నట్టు గడిచేది కాలం మా ఇంట్లో—

—భయం భయంగా చిరాకు చిరాకుగా కొట్టుకునేది గడియారం.

మా నాన్న మనసు ఎపుడూ సరిగా వుండేది కాదు. దుస్తులూ, జుత్తూ ఏవీ సరిగా వుండేవి కాదు రాత్రులు.

వుదయాన్నే శుభ్రంగ బయలుదేరిన వ్యక్తి అస్తవ్యస్తంగా ఎందుకు వచ్చేవాడో తనకా రోజుల్లో అర్థం అయేదికాదు.

అమ్మ కళ్ళలో స్వచ్ఛమైన నీరు సుడి తిరిగినా ఎపుడూ బయటికి వచ్చేదికాదు.

ఎక్వేరియం గోడల్లోంచి లోపలికి చూసి నట్టుండేది అమ్మ కళ్ళలోకి చూస్తే.

'నా కళ్ళల్లో నీరే నిండేక నిద్రకి చోటేది?' అని పాట పాడినట్టు అమ్మ ఎపుడూ నిద్ర పోయేది కాదు.

నిద్ర లేకుండా కూడా అంత అందంగా వుండే కళ్ళని చూడలేదు నేను మళ్ళీ.

మళ్ళీ చూడలేదా? చూడలేదా? చూసేనా?—

నాకు నాలుగయిదేళ్ళు వచ్చి స్కూలుకి వెళ్ళే రోజుల్లో కొంచం కొంచం నత్తిగా మాట్లాడేవాణ్ని బెక్కుతూ. మొదట్లో కొంత మంది ముద్దుముద్దుగా మళ్ళీ మాట్లాడించి ఆనందించేవాళ్ళు నా మాటల్ని... ముద్దు పెట్టుకుని మరీ. అదే జీవితంలో మాటలవల్ల నేను పొందిన మెప్పయినా....ఏదైనా....

అందమైన అమ్మ, స్వచ్ఛమైన కళ్ళనీళ్ళు గల అమ్మ నాతో మాట్లాడ్డం చాలా తక్కువ. మాట్లాడినా, మాటల్లో తిట్లూ దీవెనలే ఎక్కువ. నాకు చాలాసార్లు తిన్న దెబ్బల చురుకుదనమే గుర్తు.

అసహనం, అసహాయత ఆమె రెండు చేతులు.

అసహనంతో నన్ను కొట్టేది.

అసహాయతతో మొహం కప్పుకునేది.

నేను అల్లరి చేసేవాణ్నట. ప్రతీదానికీ ఏడుపూ, గొడవా....పేచీ... పెట్టేవాణ్నట.... స్నానం చేయడం దగ్గర్నుంచీ భోజనంవరకూ. నేను ఆ ఇంటిలోకి రాకముందూ, వచ్చేకా, ఏ పరిస్థితులు వాళ్ళనా ప్రవర్తనకు ఉసిగొలిపేయో నాకు తెలీదు... అప్పటికీ ఇప్పటికీ కూడ.

రెండో, మూడో క్లాసు చదివే వేళకి నావి ముద్దుమాటలు కావనీ, నత్తిమాటలనీ స్థిర పడింది.

స్కూల్లో తనని నత్తి అని ఎవడో అన్నాడని వాణ్ని కొట్టి రెట్టింపు దెబ్బలు తిన్నాడు - స్కూల్లోని—ఇంట్లోనీ.

కాని వాడికి నెత్తురొచ్చింది. తనకి కన్నీళ్లు. అంతే తేడా. అది అందరికీ కన్పిస్తుంది. ఇది కన్పించదు.

అది ఒకసారా? రెండుసార్లా??

ఆదేవాడు కాదు. స్కూల్లోనీ. బయటా. మరీ ఒంటరిగా గడపవల్సి వచ్చేది.

ఆడ్డానికిగాని ఆట చూడ్డానికి గాని వెళ్తే— ఎవడో ఒకడు న....న.. న....అనో మ.... మ....మ....అనో అనడం—వూరుకున్నా బాధ పడ్డం, ఊర్కోపోయినా బాధపడ్డం అలవాటయింది.

అందుకేఆటపాటలకి స్టాప్ పెట్టేడుఅందర్తో.

ఒంటరిగా, ఏంతోచక, ఏం చేయాలో తెలీక, ఏమీ చెయ్యలేక వున్నపుడు ఓరోజు జ్ఞాన నేత్రం తెరుచుకుంది. కాదు తెరవబడింది.

'మానవుడి మంచి నేస్తం పుస్తకం' అన్న మాటల్తో.

'పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గది వంటిది.'

'మస్తకాలకు బూజుపడితే పుస్తకాలే దుల పాలి.'

'పుస్తకాలు కొన్ని కొరకమన్నారు. కొన్ని నమలమన్నారు. కొన్ని కొరికి నమిలి మింగి జీర్ణమంగే అని సుభాషితం.'

అతనెవరో చెప్పినవిషయం బాగా పట్టింది.

'పుస్తకాల్లో మంచివీ చెడ్డవీ లేవ'ని కూడా అతను అన్నాడు.

'మనసు బాగాలేనపుడు మనకు గిలిగింతలు పెట్టగలవికూడా పుస్తకాలే' అన్నాడు.

'ఒక్కొక్క పుస్తకం ఒక జీవితం. దాని అనుభవాలూ' అన్నాడు.

'ఒక్కొక్క మానవ జీవితం సగం తెరిచిన పుస్తకమ'న్నాడు.

"దాంట్లో తెరచిన పేజీలు కాకుండా తెరవని పేజీలు చదవకాన్కి అనుభవం, తెలివితేటలూ కావాలి. జీవితం తెలియాలి."

'ఒక జీవితం ద్వారా తెలుసుకునే విషయాలు ముందుగానే పుస్తకంద్వారా తెలుసుకోవచ్చు' అన్నాడు.

అప్పట్లో ఆ మాటలు తనకి అర్థంకాలేదు. మాటలు గుర్తున్నయ్ అంతే.

పిల్లలయినా 'చందమామే' కాకుండా అన్ని పుస్తకాలూ, డిటెక్టివ్ పుస్తకాలూ చదవ్వొచ్చు అన్న మొదటి పెద్దమనిషి ఆయనే!

కంటపడిన ప్రతీ పుస్తకం చదివాను. కనపడిన ప్రతీ వాక్యం చదివాను.

పకోడీ పొట్లాల కాగితాలమీద రాసిన రాతలూ చదివాను.

ఎక్కడబెడితే అక్కడ విసిరివేయబడి వుంది సాహిత్యం అని గ్రహించాను.

'మంచి సాహిత్యం దొరకదు' 'వుత్తమ

సాహిత్యం అరుదు' 'గ్రేట్ రచనలు మృగ్యం' వంటి వాక్యాలు అంత—అంత ఏమిటి?— ఎంత మాత్రం సత్యం కాదని గ్రహించాను.

నీకు చూడాలని వుండాలేగాని ఎక్కడ చూస్తే అక్కడ కన్పిస్తుంది వుత్తమ రచన.

మనం గ్రహించడంలో వుంది.

అసలీ చెత్త సాహిత్యం ఒక పారామీటరు అమ్మాయిల జడల్లా—

రేడియోలో విన్నాను. కథలూ....కవిత్వం పాటలూ, గీతాలూ....సంగీత రూపకాలూ....

ఎన్ని విన్నా, చదివినా, తెలిసిన విషయం ఒకటే. మానవతా విలువలున్నవీ, మానవుడి భావాలను మానసిక సంఘర్షణలనూ వుద్వేగాలనూ స్పృశించేవన్నీ వుత్తమమయినవే. వుదాత్తమయినవే....

జీవితంలో వున్న డ్రామా, విషాదం నామ మాత్రంగానైనా ఈ రచనలు స్పృశిస్తున్నాయా?

ఆలోచన తెగలేదు.

ప్రతీ గొప్ప పుస్తకం ఒక సత్యాన్ని తెలిపింది. ఏక నీతిని తెలిపింది.

ఒంగడం, ఒదగడం ముఖ్యమైన ఘోరాలనీ నేరాలనీ ప్రతీచోటా రాశారు.

'జీవితాన్ని తప్పొప్పుల పట్టిక' అన్నారు.

'చేసిన తప్పు చెయ్యకుండా తప్పు చెయ్యడమే జీవితం' అన్నారు.

లంచం, కట్నం, అబద్ధం, స్వార్థం, క్రూరత్వం, అసభ్యం, అసహ్యం, అన్యాయం, నీచం, లోభం, కక్కూర్తి....ఇదేమిటి? అదేమిటి ఎన్నో కూడదన్నారు.

కొన్ని కూడదన్నారు.

కొన్ని కూడదనకుండానే కూడదనిపించింది నా అంతరాత్మకి.

ఇదేమిటో కొత్తపదం నా ఆలోచనల్లోనికి వూహల్లోనికి ప్రవేశించింది దానంతట అదే—

ఎలా వచ్చింది?

ఏమో తెలీదు.

ఇవన్నీ నా ఊహల్లో స్థిరపడేసరికి నేను పదిహేనేళ్ళు ఎదిగాను అరుమీద.

ఎన్ని పుస్తకాలు చదివాను?

ఏం చదివాను?

లెక్క తెలీదు. గుర్తులేదు.

రేడియో వినడంద్వారా ఒకటి తెలిసింది.

ప్రతీ భాషకీ సొగసైన పదాలు వుంటాయి. వాటిన్ని పలకడంలో శోకు వుంది. అందం వుంది. ఒక పదాన్ని రిప్లేస్ చేసే పదం ఆ భాషలోగాని మరో భాషలోగాని వుండదు.

ఒక వాక్యం ఎక్కడ విన్నానో చదివానో గురులేదు. అది ఇదీ: "మన రేడియోలోగాని TV పైగాని విన్నపుడు సాధారణంగా ఏం చెబుతున్నారని వింటాంగాని, ఏం చెబుతున్నారో మానేసి ఆ శబ్దాల్ని వినండి పలకడానికి" అని.

అలా కొన్నాళ్ళకి ఒకటి తెలిసింది—

ఎంతమంది మనుషులు ఎన్ని పదాలు ఎన్నిసార్లు విన్నా ఎలా పలకలేకపోతున్నారు!!

నాకు తెలిసినా పలకలేను.

వాళ్ళకి తెలీక పలకలేరు.

ఒక పదాన్ని పలకవలసినట్టు పలకలేకపోవడం నత్తేనా కాదా?

గుర్తించని నత్తిగావచ్చు గాని నత్తి నత్తే.

నాలో ఏ లోపం ఈ నత్తికి కారణం?

వాళ్ళలో ఏ లోపం ఆ నత్తికి కారణం?

పుస్తకాల్లో చదువుతున్నారు.

స్టేజిలమీద పలుకుతున్నారు.

'గీత'లు చేతిలోధరించి మనుషులు కళ్ళద్దాలు సవరింపుతున్నారు.

ఏం చెబుతున్నారు?

ఏం చేస్తున్నారు?

చరించవల్సినట్టు చరించలేకపోవడం నత్తి



కాదా?

ఏ అశక్తత నాచేత పదాల్ని పలికించలేక పోతోంది!

ఏ అశక్తత నా చేత ఇతరుల్ని దిద్దించలేక పోతోంది?

. రోడ్లు తిన్నగానే వుండవని విన్నాను. కాని మలుపులో ప్లాన్డ్‌గా వుండవు.

కాని పేర్లు మాత్రం సరళంగా, రేఖాత్మకంగా వుంటాయి.

సరళతో ఎలా పరిచయం అయిందో నాకు గుర్తులేదు.

కానీ బాగా పెరగడం గుర్తు.

జీవితంలో అంత అందమైన కళ్ళని నేను చూడ్డం రెండవసారి.

ఆమెపేరు మిస్ చిరునవ్వు అనుకున్నాను.

ఆమె ఎడ్రస్ కేర్ హాపినెస్ అనుకున్నాను.

ఆమె గమ్యం నేనే. .

'నా సుఖాలన్నీ నీవే నీ కష్టాలన్నీ నావే నువ్వు బతుకు నేనూ బతుకుతా' అని మృదు మధురంగా పాడినట్టు అన్పించింది నా హృదయానికి.

చెవులతో వింటే హృదయంలో ధ్వనించడం అంటే ఇదేనా?

'నీ నీలికురుల నీడలలో సాయంత్రాలు చూసుకుంటా' అని పాడుకున్నాను ఒంటరిగా.

'నీలో వున్నదేదో నీ ఫోటోలో లేదు' అనీ

'వరించవూ సవరించవూ వసంతం నా జీవితాన్ని' అని గొంతెత్తేను ఒంటరిగా సాయం సంధ్యకాంతుల వెలుగు నీడల.

ఊహాలు నింపిన కాగితం చిరిగిపోయింది.

చేదుజ్ఞాపకాల డైరీలో మరో కాగితం పెరిగిపోయింది.

మళ్ళీ కారణం.

దారుణం.

ఏమిటి?

అదే——

ఏమిటి?

న....న... న...

మనసుకి వుంటే కాని లోపం ...

జీవితంలో వుంటే కాని లోపం....

కట్టుబడని మాటకి వుండే లోపం....

నోటిమాటకి వున్న లోపం లోపమా?

ఉన్నవన్నీ లేనట్టేనా?! లేని ఒక్కటీ వున్నట్టేనా?!

ఎన్ని రాత్రులు ఆలోచించినా——

ఎన్ని పేజీలు చించినా——

ఎన్ని తేదీలు గడిచినా——

మిగిలేది ఒక్కటే. ఒక్కటే. ఒక్క కన్నీటి చుక్క.. దాని ఖరీదు గట్టే షరాబున్నాడా?

అమిత వేదన. విడుదల చేసే కన్నీటిబొట్టు కాన్‌సెంట్రేషన్ కనుక్కున్నాడా ఏ సైంటిస్ట్ అయినా?

తిరుగు మరో మలుపు....

పెంచుకో విజ్ఞానం....

ఎదుగు మనిషిగా....

న్యాయంగా...

సత్యంగా....

సభ్యంగా. ..

నిస్వార్థంగా....

. . గా

. గా

.. గా....

ప్రతీ ఒక్క 'గా' నిన్ను దెబ్బతీస్తుంది.

పచ్చడి చేస్తుంది.

నంజుకుంటుంది.

నన్ను నత్తివాణ్ణిచేస్తుంది మానసికంగా....

మంచికీ చెడుకీ తేడా తెలీదు.

ఏదిచేయాలో తెలీదు.

ఏం చేయకూడదో తెలీదు.

దానికంటే నా నత్తే నయం.

బెంగుళూరు వెళ్ళి నయం చేసుకుంటా.

కాని ఈ నత్తికి విరుగుడేమిటి?

విజ్ఞానం కలిగించే, విజ్ఞానం తెచ్చియిచ్చే ఈ 'హేండీకేప్'కి క్యూరేమిటి?

ఈ వంకర నడకకి

ఈ నత్తి పలుక్కి

అంతం ఎక్కడ——?

షో మీ !

□